
సాక్షి
వికారాబాద్
శనివారం । 15 । జూన్ । 2024



పశువుల రవాణాపై ఫోకస్
బక్రీద్ పండగ ప్రశాంతగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం పటిష్టమైన భద్రత ఏర్పాట్లను చేపట్టింది. 8లో ▸



చిరుత సంచారం!
అనంతగిరి అడవుల్లో చిరుత సంచారం మరోసారి కలకలం రేపింది. శుక్రవారం కుక్కలపై దాడి చేసి చంపేసింది. 8లో ▸



సమస్యల వలయంలో..
గ్రామ పంచాయతీల్లో సర్పంచుల పదవీ కాలం ముగియడంతో సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదు. 9లో ▸

న్యూస్‌రీల్

రెండ్రోజుల్లో పనులు పూర్తి కావాలి

కలెక్టర్ నారాయణరెడ్డి



అనంతగిరి: అమ్మ ఆదర్శ పాఠశాలల్లో చేపట్టిన పనులను రెండు రోజుల్లో పూర్తి చేయాలని, ప్రతి విద్యార్థికి యూనిఫాం అందాలని కలెక్టర్ సి.నారాయణరెడ్డి ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ నుంచి టెలి కాన్ఫరెన్స్ ద్వారా అధికారులతో మాట్లాడారు. అమ్మ ఆదర్శ పాఠశాలల్లో పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. విద్యార్థులకు తాగునీరు, భవనాలకు మరమ్మతులు, విద్యుత్ సదుపాయం, మరుగుదొడ్లు ఉండేలా చూడాలన్నారు. బడీడు పిల్లలు పాఠశాలలో చేరేలా ప్రధానోపాధ్యాయులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

ధరణి దరఖాస్తులను పరిష్కరించండి

ధరణి పెండింగ్ దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ నారాయణరెడ్డి ఆదేశించారు. శుక్రవారం సీసీఎల్ఏ కమిషనర్ నవీన్ మిట్టల్ జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ తోపాటు అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, ఆర్డీవోలు, తహసీల్దార్లు పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ధరణి, ప్రజావాణి దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు.

నీట్ ఫలితాలపై విచారణ జరిపించాలి

ఆర్ఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు భీంరాజ్



సమావేశంలో మాట్లాడుతున్న భీంరాజ్

కొడంగల్: నీట్ పరీక్షలో అవకతవకలు జరిగాయన్న ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో పూర్తిస్థాయి విచారణ జరిపించాలని రీవల్యూషనరీ స్టూడెంట్స్ యూనియన్ (ఆర్ఎస్‌యూ) రాష్ట్ర అధ్యక్షుడు భీంరాజ్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. నీట్ పరీక్ష ఫలితాలపై సమగ్ర విచారణ జరిపించాలన్నారు. 2024 విద్యా సంవత్సరంలో మెడికల్ విద్యను అభ్యసించడానికి జాతీయ స్థాయిలో నిర్వహించిన నీట్ పరీక్ష ఫలితాలు జూన్ 4న హడావుడిగా ప్రకటించారని విమర్శించారు. 67 మందికి 720కు 720 మార్కులు వచ్చాయని, జాతీయ స్థాయిలో మొదటి ర్యాంకు రావడం అందులో ఏడుగురు విద్యార్థులు ఒకే సెంటర్‌కు చెందిన వారు కావడం అనుమానాలకు తావిస్తోందన్నారు. జూన్ 14న ప్రకటించాల్సిన ఫలితాలను 4వ తేదీన ఎందుకు విడుదల చేశారని ప్రశ్నించారు. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీపై సిట్టింగ్ జడ్జితో న్యాయ విచారణ జరిపించాలన్నారు. 24 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్‌ను కాపాడాలన్నారు. సమావేశంలో సురేష్‌గౌడ్, చంద్రకిరణ్, భాస్కర్, శివకుమార్, రమేష్, కృష్ణ యాదవ్, నరేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆహా ఏమి రుచి..

వాసవి మహిళా సంఘం ఆధ్వర్యంలో ఫుడ్ మేళా



ఫుడ్ మేళాలో పాల్గొన్న మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్న తదితరులు

తాండూరు: పట్టణంలోని ఆర్యవైశ్య కల్యాణ మండపం ఓపెన్ ఆడిటోరియంలో శుక్రవారం ఫుడ్ మేళా నిర్వహించారు. ఆర్యవైశ్య సంఘం సౌజన్యంతో వాసవి మహిళా సంఘం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. సంఘం సభ్యులతో పాటు పలువురు హాజరై కొత్తరకం వంటకాల రుచి చూశారు. మహిళలు వంటలు తయారు చేసి ప్రదర్శించారు. మున్సిపల్ చైర్ పర్సన్ స్వప్న, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

బీసీ గురుకులంలో టెండర్లకు ఆహ్వానం

చేవెళ్ల: మహాత్మా జ్యోతిబా పూలే బీసీ గురుకుల పాఠశాల, కళాశాలలో ఫుడ్ క్యాటరింగ్ సరుకులు, బార్బర్లకోసం టెండర్లు ఆహ్వానిస్తున్నట్లు నవాబుపేట బీసీ(బాలుర) గురుకుల పాఠశాల, కళాశాల ప్రిన్సిపాల్ వెంకట్‌రావు అన్నారు. చేవెళ్లలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. చేవెళ్ల మండలం గొల్లపల్లి సమీపంలోని బండారి శ్రీనివాస్ ఇంజనీరింగ్ కళాశాలలో కొనసాగుతున్న నవాబుపేట బీసీ గురుకుల పాఠశాల, కళాశాలలో విద్యార్థులకు ఈ విద్యాసంవత్సరం 2024–25కుగాను టెండర్లు ఆహ్వానిస్తున్నట్లు చెప్పారు. గురుకులానికి కిరాణా సరుకులు, కూరగాయలు, పండ్లు, గుడ్లు, చికెన్, మటన్, క్యాటరింగ్, బార్బర్‌ల కోసం టెండర్లు పిలుస్తున్నట్టు చెప్పారు.

నేనున్నా.. నీకేం కాదు నాన్నా

- గాయాలను లెక్కచేయకుండా తండ్రికి ధైర్యం చెప్పిన బాలుడు
- స్థానికుల సాయంతో ఆస్పత్రికి తరలింపు

యాలాల: రోడ్డు ప్రమాదంలో తండ్రీకొడుకులు గాయపడగా.. తనకు తగిలిన దెబ్బలను ఏమాత్రం లెక్కచేయకుండా.. తీవ్రంగా గాయపడిన తండ్రికి.. పన్నెండేళ్ల బాలుడు ధైర్యం చెప్పిన తీరు అందరినీ ఆశ్చర్యపరిచింది. తండ్రి తల నుంచి రక్త స్రావాన్ని ఆపేందుకు ఒక చేతిని అదిమి పట్టుకుని ఆస్పత్రికి తీసుకెళ్లడం చూపరుల హృదయాన్ని కదిలించింది. వివరాలు ఇలా ఉన్నాయి.. మండల పరిధిలోని జక్కేపల్లికి చెందిన దక్కలి జగ్గప్ప కరాటే మాస్టర్. శుక్రవారం వ్యక్తిగత పని నిమిత్తం కొడుకు బ్రూస్లీతో కలిసి తాండూరుకు వచ్చాడు. పని ముగించుకొని బైక్‌పై స్వగ్రామానికి బయలుదేరాడు. ఈ క్రమంలో మండల సరిహద్దులోని బైపాస్ రోడ్డు సమీపంలో కోడి గుడ్ల లోడ్‌తో ఎదురుగా వస్తున్న మినీ డీసీఎం వీరి వాహనాన్ని ఢీకొట్టింది. దీంతో జగ్గప్ప తలకు తీవ్ర గాయం కాగా బ్రూస్లీకి స్వల్ప గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు ప్రమాదానికి కారణమైన వాహనంలోనే జగ్గప్పను తాండూరులోని ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో వైద్యులు హైదరాబాద్‌కు రిఫర్ చేశారు.

తండ్రి కోసం తాపత్రయం

ప్రమాదంలో తలకు తీవ్ర గాయమై రక్తపు మడుగులో పడి ఉన్న జగ్గప్పకు కొడుకు బ్రూస్లీ ధైర్యం చెప్పాడు. నేనున్నా నీకేం కాదు నాన్నా.. అంటూనే.. కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి విషయం చెప్పాడు. అనంతరం స్థానికులతో కలిసి తండ్రిని ఆస్పత్రికి తరలించే సమయంలో జగ్గప్ప తల నుంచి రక్త స్రావం కాకుండా తలకు బట్టతో అదిమి పట్టుకొని ఆస్పత్రికి వెళ్లాడు. ఏమాత్రం ఆందోళన చెందకుండా బాలుడు వ్యవహరించిన తీరును స్థానికులు మెచ్చుకున్నారు.



తండ్రికి గాయాలైన విషయాన్ని కుటుంబసభ్యులకు ఫోన్‌లో తెలుపుతున్న కుమారుడు బ్రూస్లీ

టార్గెట్.. 29 లక్షలు

వన మహోత్సవానికి సర్వం సిద్ధం

- 29 లక్షల మొక్కలు నాటాలని లక్ష్యం
- గతేడాదితో పోలిస్తే 10లక్షలకు పైగా కుదింపు
- 20 ప్రభుత్వ శాఖలకు బాధ్యతలు
- 566 జీపీలు, 15 ఫారెస్టు నర్సరీల్లో సిద్ధంగా ఉన్న మొక్కలు



పెద్దేముల్ మండలం కందనెల్లి వద్ద మొక్కలు నాటేందుకు గుంతలు తీస్తున్న కూలీలు

వికారాబాద్: జిల్లాలో వన మహోత్సవ (హరితహారం) కార్యక్రమానికి అధికార యంత్రాంగం సిద్ధమవుతోంది. ఎప్పటిలాగే ఈ సారి కూడా లక్ష్యాలను నిర్దేశించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం 8 విడతలుగా హరితహారం పేరిట మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించింది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో హరితహారాన్ని వన మహోత్సవం పేరిట నిర్వహించాలని నిర్ణయించింది. అయితే ముందుగా నిర్దేశించిన లక్ష్యాలను సవరిస్తూ లక్ష్యాన్ని భారీగా కుదించారు. తొలుత జిల్లాలో 40,53,500 మొక్కలు నాటాలని లక్ష్యం పెట్టుకోగా దాన్ని కుదించి 29,33,000గా నిర్ణయించారు. వర్షాకాలం ప్రారంభం కావటంతో మొక్కలు నాటే కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని నిర్ణయించారు. ప్రభుత్వ శాఖలను భాగస్వాములను చేసి లక్ష్యాలను నిర్దేశిస్తున్నారు. గతేడాది 19 శాఖలను భాగస్వాములను చేయగా ఈ ఏడాది 20 శాఖలకు బాధ్యతలు అప్పగించాలని నిర్ణయించారు. అటవీ, గ్రామీణాభివృద్ధి శాఖల పర్యవేక్షణలో కార్యక్రమ రూపకల్పన చేస్తున్నారు. కలెక్టర్ నారాయణ రెడ్డి, అడిషనల్ కలెక్టర్ రాహుల్‌శర్మ ఈ కార్యక్రమాన్ని దగ్గరుండి పర్యవేక్షిస్తున్నారు. ఇప్పటికే ఆయా శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించిన దిశా నిర్దేశం చేశారు.

సిద్ధంగా ఉన్నాం

వన మహోత్సవ కార్యక్రమానికి పూర్తిస్థాయిలో సన్నద్ధులమవుతున్నాం. అటవీ శాఖ, డీఆర్‌డీఓ ఆధ్వర్యంలోని నర్సరీల్లో మొక్కలు సిద్ధంగా ఉన్నాయి. శాఖల వారీగా లక్ష్యాలు నిర్దేశించడం కూడా పూర్తయ్యింది. వర్షాలు పడుతున్నందున వెంటనే కార్యక్రమాన్ని ప్రారంభించేందుకు చర్యలు చేపట్టాం. మొక్కలు నాటడంతోపాటు వాటి సంరక్షణ బాధ్యతలు కూడా తీసుకుంటాం. మొక్కలు ఎండిపోతే సంబంధింత సిబ్బందిపై చర్యలు ఉంటాయి.

– శ్రీనివాస్, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి

పక్కా ప్రణాళికతో..

విరివిగా మొక్కలు నాటి అటవీ ప్రాంతాన్ని పెంచాలన్నదే వన మహోత్సవ లక్ష్యం. ఈ సంవత్సరం తొమ్మిదో విడత కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా 29,33,000 మొక్కలను నాటాలని నిర్ణయించారు. గత ఏడాది నర్సరీల తోపాటు నాటిన మొక్కల్లో చాలావరకు ఎండిపోయాయి. 80శాతం మొక్కలు బతికాయని అధికారులు చెబుతున్నా వాస్తవానికి మాత్రం 50 నుంచి 60 శాతం మాత్రమే బతికినట్లు తెలుస్తోంది. ఈ ఏడాది అలాంటి పొరపాట్లు జరగకుండా 80 శాతం పైగా మొక్కలను సంరక్షించే విధంగా పక్కా ప్రణాళికతో ముందుకు వెళ్లాలని నిర్ణయించారు. ప్రతి గ్రామంలో.. ఖాళీ ప్రదేశాల్లో.. పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, సబ్‌సెంటర్లు, రోడ్డు పక్కన, బంజరు భూముల్లో, పొలం గట్ల వద్ద.. ఇలా అవకాశం ఉన్న ప్రతిచోటా మొక్కలను నాటాలని నిర్ణయించారు.

నర్సరీల్లో సిద్ధంగా మొక్కలు

జిల్లా వ్యాప్తంగా అటవీ, గ్రామీణాభివృద్ధి శాఖల ఆధ్వర్యంలో 581 నర్సరీల్లో మొక్కలను పెంచుతున్నారు. అటవీ శాఖ ఆధ్వర్యంలో 15, గ్రామీణాభివృద్ధి శాఖ పర్యవేక్షణలో 566 గ్రామ పంచాయతీల్లో నర్సరీలు ఉన్నాయి. వీటిలో 38,30000 మొక్కలను పెంచుతున్నారు. టేకు మొక్కల పెంపకానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారు. జీపీలకు సంబంధించి ఒక్కో నర్సరీలో 5వేల చొప్పున 28,30,000 మొక్కలు.. 15 ఫారెస్టు నర్సరీల్లో కలిపి 10లక్షల మొక్కలు పెంచుతున్నారు. ఫారెస్ట్ పీసెస్ కింద గచ్చకాయ, వెదురు, గుల్‌మోర్, రేన్‌ట్రీ, రావి, మర్రి, కానుగ, తురాయి, గార్డెనింగ్ మొక్కలు, దానిమ్మ, నిమ్మ, గోరింటాకు, తదితర మొక్కలను పెంచుతున్నారు. హోం సీడ్ కింద పూలు, పండ్ల మొక్కలను పెంచుతున్నారు.

మళ్లీ సరిహద్దు వివాదం

- తెలంగాణ అటవీ భూములను ఆక్రమించిన కన్నడ రైతులు
- 300 ఎకరాల్లో పదేళ్లకు పైగా అక్రమ సాగు
- అడ్డుకున్న తెలంగాణ రైతులు
- ఎనిమిది మంది కన్నడ రైతులపై కేసు

బషీరాబాద్: వికారాబాద్ జిల్లాలోని తెలంగాణ – కర్ణాటక అటవీ సరిహద్దు వ్యవహారం మరోసారి వివాదంగా మారింది. బషీరాబాద్ మండలం మైల్వార్ రిజర్వ్ ఫారెస్టు పరిధి(నీళ్లపల్లి అటవీ ప్రాంతం)లోని 300 ఎకరాల భూమిని కర్ణాటక రాష్ట్రం గోప్యానాయక్‌తండాకు చెందిన 15 మంది రైతులు పదేళ్లుగా సాగు చేస్తున్నారు. ఈ భూములు తమవంటే తమవని రెండు రాష్ట్రాల రైతులు పలుమార్లు గొడవ పడ్డారు. పలుమార్లు తెలంగాణ ఫారెస్ట్ అధికారులు కన్నడ రైతులు సాగు చేస్తున్న భూములు తెలంగాణ పరిధిలోకి వస్తాయన్న నక్షలు, ఆధారాలు చూపారు. అయితే అవి తమ భూములేనని కర్ణాటక రెవెన్యూ అధికారులు గతంలో వాదించారు. ఇదే విషయమై 2020 జూన్ 26న నీళ్లపల్లి అటవీ భూముల వివాదంపై తెలంగాణ, కర్ణాటకకు చెందిన రెవెన్యూ, ఫారెస్టు అధికారులు చర్చలు జరిపినా మళ్లీ భూముల లొల్లి మొదటికి వచ్చింది. శుక్రవారం కర్ణాటక రైతులు భూములను సాగు చేయడానికి రాగా ఇస్మాయిల్‌పూర్ గిరిజన రైతులు అడ్డుకున్నారు. అధికారులకు ఫిర్యాదు చేయడంతో ఫారెస్టు సెక్షన్ అధికారి ఫిర్యానాయక్, రెవెన్యూ సర్వేయర్ అక్కడి చేరుకొని భూములను పరిశీలించారు. తమ పరిశీలనలో కన్నడ రైతులు సాగు చేస్తున్న భూములు తెలంగాణ అటవీ ప్రాంత పరిధిలో ఉన్నట్లు ఫారెస్ట్, రెవెన్యూ అధికారులు తేల్చారు. గతంలో తెలంగాణ సరిహద్దులోని ఇస్మాయిల్‌పూర్, నీళ్లపల్లి వాసులు.. కర్ణాటక సరిహద్దులోని గోప్యానాయక్ తండా, బొందంపల్లి రైతులతో చర్చలు జరిపినట్లు తెలిపారు.

అవి తెలంగాణ భూములే..

మైల్వార్ రిజర్వుడ్ ఫారెస్టులోని కంపార్ట్‌మెంట్ 49లో 811 హెక్టార్ల భూ భాగం ఉంది. ఆ భూముల్లోనే బషీరాబాద్ మండలంలోని నీళ్లపల్లి, ఇస్మాయిల్‌పూర్, కర్ణాటకలోని బొందంపల్లి, గోప్యానాయక్‌తండా ట్రై జంక్షన్ ఉంది. గతంలో దాని ఆధారంగా తాము సర్వే చేసి తెలంగాణ భూములుగా గుర్తించాం. అక్రమంగా సాగు చేస్తున్న 8 మంది కన్నడ రైతులపై కేసులు నమోదు చేశాం. ఇరు రాష్ట్రాల ప్రభుత్వాలు కలెక్టర్ స్థాయిలో చర్చించి, ఉమ్మడి సర్వే చేస్తే సరిహద్దులు తేలుతాయి. ఈ సర్వే చేపట్టాలని గతంలోనే ఉన్నతాధికారులకు నివేదిక ఇచ్చాం.

– ఫిర్యానాయక్, ఫారెస్టు సెక్షన్ ఆఫీసర్



భూముల మ్యాప్‌ను పరిశీలిస్తున్న అటవీ, రెవెన్యూ శాఖ అధికారులు



బడిబాట కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఈఓ సుశీందర్ రావు

ప్రైవేటుకు దీటుగా సర్కారు విద్య

జిల్లా విద్యాధికారి సుశీందర్ రావు

మహేశ్వరం: బడీడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని జిల్లా విద్యాధికారి సుశీందర్ రావు పేర్కొన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో శుక్రవారం బడి బాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో అనుభవంతో కూడిన ఉపాధ్యాయులతో నాణ్యమైన విద్యా బోధన అందిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో చదివే ప్రతి విద్యార్థికి రెండు జతల యూనిఫాం, మధ్యాహ్న భోజనం, ఉచితంగా పాఠ్య పుస్తకాలు, నోట్ బుక్స్ పంపిణీ చేస్తుందన్నారు. కార్పొరేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్య అందిస్తున్నామని తెలిపారు. అధిక ఫీజులు వసూలు చేసే ప్రైవేట్ పాఠశాలల్లో పిల్లలను చేర్పించి ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కోవద్దని సూచించారు. విద్యార్థులపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ చూపిస్తే అద్భుత విజయాలు సృష్టించవచ్చని తెలిపారు. అంతకు ముందు పిల్లలకు అక్షరాభ్యాసం చేయించి పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీపీ కె.సునీతా నాయక్, ఎంఈఓ కృష్ణ, ఎంపీడీఓ శైలజ, మండల నోడల్ అధికారి కస్నా నాయక్, ఎంపీటీసీ పి.సుదర్శన్ యాదవ్, ప్రధానోపాధ్యాయుడు శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యతోనే గుర్తింపు

రంగారెడ్డి అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్

ఇబ్రహీంపట్నం రూరల్: విద్యతోనే సమాజంలో గుర్తింపు లభిస్తుందని అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ అన్నారు. సమీకృత కలెక్టరేట్ సమావేశ మందిరంలో శుక్రవారం జిల్లా గిరిజన అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ ప్రజ్ఞ హైస్కూల్, ఆమనగల్లు, ఫాతిమా హైస్కూల్ కొత్తూరులో 3,5,8వ తరగతుల్లో గిరిజన బాలురు, బాలికల ఎంపిక కోసం లక్కీ డ్రా నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు ఇష్టపడి చదివి అన్ని రంగాల్లో రాణించాలన్నారు. మూడో తరగతిలో 45 సీట్లు ఉండగా 39 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారన్నారు. ఐదో తరగతిలో 22 సీట్లుకు గాను 58 మంది దరఖాస్తు చేసుకున్నారని, 8వ తరగతిలో 22 సీట్లకు గాను 137 మంది దరఖాస్తు చేసుకున్నట్టు తెలిపారు. వీరిలో 44 మందిని లక్కీ డ్రా ద్వారా ఎంపిక చేసినట్లు తెలిపారు.

గొర్రెల పథకానికి మంగళం

రెండో విడత లేనట్టే !

- లబ్ధిదారులు చెల్లించిన వాటా ధనం తిరిగి వారి ఖాతాల్లోకే..
- ఒక్కో యూనిట్‌కు చెల్లించిన మొత్తం రూ.43,750
- 7,500 మంది ఖాతాల్లో రూ.34.12కోట్ల జమ
- పథకం అమలు చేయాలంటున్న గొల్లకురుమలు



తాండూరు: గొల్లకురుమల కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించాలనే ఉద్దేశంతో గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన గొర్రెల పంపిణీ పథకం నిలిచిపోయింది. గతంలో రెండో విడత గొర్రెల కోసం డీడీలు కట్టిన లబ్ధిదారులు కొంత కాలంగా పథకం అమలు కోసం ఎదురు చూస్తున్నారు. అయితే మొదటి విడతలో అక్రమాలు చోటుచేసుకున్న నేపథ్యంలో లబ్ధిదారులు చెల్లించిన వాటా ధనం వెనక్కి ఇవ్వాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. దీంతో నెల రోజులుగా డీడీలు కట్టిన వారి ఖాతాల్లో నగదును జమ చేస్తున్నారు. ఇప్పటి వరకు 85 శాతం వరకు వాటా ధనం వెనక్కి ఇచ్చారు. మరో 1000 మంది లబ్ధిదారులకు చెల్లించాల్సి ఉంది. జిల్లాలో గొల్లకురుమ కుటుంబాలు అధికంగా ఉన్నాయని, వారి ఆర్థిక పరిస్థితిని దృష్టిలో ఉంచుకొని ఇతర పథకాల తరహాలోనే గొర్రెల పంపిణీని కొనసాగించాలని గొల్లకురుమలు కోరుతున్నారు.

మొదటి విడతలో 11,214 మందికి

గత ప్రభుత్వం 2017లో గొర్రెల పంపిణీ కార్యక్రమం చేపట్టింది. జిల్లా వ్యాప్తంగా సుమారు 22,546 కుటుంబాలను అర్హులుగా గుర్తించారు. ఒక్కో కుటుంబాన్ని ఒక యూనిట్‌గా పరిగణించి 75 శాతం సబ్సిడీపై 2017 – 18 ఆర్థిక సంవత్సరంలో మొదటి విడత గొర్రెలను పంపిణీ చేశారు. ఒక్కో యూనిట్‌కు రూ.1.25 లక్షలు నిర్ణయించి 20 గొర్రెలు, ఒక పొట్టేలను పంపిణీ చేశారు. జిల్లా వ్యాప్తంగా 11,214 మంది లబ్ధిదారులకు 2.35 లక్షల గొర్రెలు, పొట్టేళ్లను అందజేశారు. రెండో విడత పంపిణీ కార్యక్రమాన్ని గత ప్రభుత్వం ఆలస్యం చేసింది. అయితే ఆరు నెలల క్రితం జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో మొదటి విడత అక్రమాలపై విచారణ చేపట్టింది. దీంతో రెండో విడత ఆగిపోయింది. రెండో విడత కోసం లబ్ధిదారులు తమ వాటా కింద 25శాతం నగదును డీడీల రూపంలో చెల్లించారు. 8,500 మంది లబ్ధిదారులు రూ.37.18కోట్లు చెల్లించగా 7,500 మంది ఖాతాల్లో రూ.34.12కోట్లు తిరిగి జమ చేశారు. మరో 1000 మంది లబ్ధిదారులకు వాటా ధనం తిరిగి ఇవ్వాల్సి ఉంది.

వడ్డీకి తెచ్చి నష్టపోయాం

రెండో విడత గొర్రెల పంపిణీ కోసం తమ వాటి కింద కట్టాల్సిన డబ్బును అప్పు తెచ్చి కట్టామని, ప్రభుత్వం మారడంతో పథకం నిలిచిపోయిందని.. ఈ కారణంగా తాము నష్టపోతున్నామని పలువురు లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేశారు. ఏడాది కాలంగా తెచ్చిన డబ్బుకు దాదాపు రూ.10 వేలు వడ్డీ చెల్లించామని పేర్కొన్నారు. ఈ నష్టాన్ని ఎవరు భరిస్తారని ప్రశ్నిస్తున్నారు.

లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేశాం



ప్రభుత్వ ఆదేశాల మేరకు గొర్రెల యూనిట్ల కోసం డీడీలు తీసిన లబ్ధిదారుల ఖాతాల్లో వారి వాటా ధనం తిరిగి జమ చేశాం. జిల్లా వ్యాప్తంగా 8,500 మంది డీడీలు చెల్లించారు. ఇప్పటి వరకు 7,500 మంది ఖాతాల్లో రూ.34.12 కోట్లు జమ చేశాం. మిగిలిన వారికి కూడా త్వరలో డబ్బులు జమ చేస్తాం.

– డాక్టర్. సదానందం, పశుసంవర్ధక శాఖ అధికారి

క్లుప్తంగా

ప్రభుత్వ కళాశాలలో అడ్మిషన్లు ప్రారంభం

దౌల్తాబాద్: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 2024–25 సంవత్సరానికిగాను అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని ప్రిన్సిపాల్ శంకర్‌నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. చుట్టు పక్కల గ్రామాల విద్యార్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కళాశాలలో ఎంపీసీ, బీపీసీ, సీఈసీ కోర్సులు కొనసాగనున్నట్లు ఆయన తెలిపారు. పేద విద్యార్థులకు మంచి అవకాశం అన్నారు.

నిధుల దుర్వినియోగంపై చర్యలు తీసుకోండి

పీడీ కార్యాలయాన్ని ముట్టడించిన బురాన్‌పూర్ గ్రామ సంఘం సభ్యులు



పీడీ కార్యాలయం వద్ద మహిళాసంఘాల నాయకురాళ్లు

బొంరాస్‌పేట:నిధుల దుర్వినియోగానికి పాల్పడిన మహిళా సంఘాల నాయకురాళ్లపై చర్యలు తీసుకోవాలని మండలంలోని బురాన్‌పూర్ గ్రామ సంఘాల సభ్యులు ఐకేపీ పీడీ కార్యాలయాన్ని ముట్టడించారు. దీనిపై గతంలోనే ప్రజావాణిలో సంబంధిత మహిళా సంఘాల ప్రతినిధులు ఫిర్యాదు చేసినా స్పందన లేకపోవడంతో శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఐకేపీ పీడీ కార్యాలయంలో ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. బురాన్‌పూర్ 2వ గ్రామ సంఘం నాయకురాళ్లు ధాన్యం కమిషన్ డబ్బులు దుర్వినియోగం చేయగా గతంలోనే ఏపీఎం అంజిలయ్య,డీపీఎం వీరయ్య, వీఓఏలు సస్పెండ్ అయ్యారు. అనంతరం రికవరీ చేసిన రూ.4.25 లక్షలు గ్రామసంఘం ఖాతాలో జమ చేయగా ప్రస్తుత అధ్యక్షురాలు సత్యమ్మ, కార్యదర్శి కవిత, కోశాధికారి పద్మమ్మ, సీసీ భీమయ్య ఎలాంటి తీర్మానాలు,ఎస్‌హెచ్‌జీలకు సమాచారం లేకుండా ఈనెల 7న డ్రా చేశారు. దీనిపై కలెక్టర్ స్పందించి డీఆర్‌డీఓను విచారణ చేసి,వెంటనే ఖాతాలో జమచేయాలని ఆదేశించారు. అయినా ప్రతినిధులపై,సీసీ భీమయ్యపై చర్యలు తీసు కోవడంలేదని గ్రామ సంఘంలోని 12 ఎస్‌హెచ్‌జీల నాయకురాళ్లు ఆగ్రహం వ్యక్తం చేశారు.

అడవి పందుల దాడిలో రైతుకు గాయాలు

బంట్వారం: అడవి పందుల దాడిలో ఓ రైతు తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ సంఘటన కోట్‌పల్లి మండల పరిధిలోని బార్వాద్‌లో చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. బార్వాద్ గ్రామానికి చెందిన పిచ్చకుంట్ల శ్రీశైలం(55) శుక్రవారం పొలం దగ్గర ఎద్దులను మేపుతున్నాడు. ఒక్కసారిగా పొదల్లో నుంచి దూసుకొచ్చిన అడవి పందులు శ్రీశైలంపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచాయి. కొద్దిసేపటికి సమీప పొలం వద్ద పని చేసే రైతులు గమనించి 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. తీవ్ర రక్త స్రావమై రైతుకి ప్రథమ చికిత్స చేసి సంగారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారు. ప్రస్తుతం శ్రీశైలం ఆరోగ్య పరిస్థితి నిలకడగానే ఉందని వైద్యులు తెలిపారు.

పశువుల రవాణాపై ఫోకస్

బక్రీద్ ముగిసే వరకు గోవుల తరలింపుపై నిషేధం

- పోలీసు శాఖ ఆధ్వర్యంలో చెక్‌పోస్టుల ఏర్పాటు



తాండూరులో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్ద తనిఖీ చేస్తున్న పోలీసులు

తాండూరు: బక్రీద్ పండగ ప్రశాంతగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం పటిష్టమైన భద్రత ఏర్పాట్లను చేపట్టింది. త్యాగానికి ప్రతీకగా చేసుకొనే బక్రీద్ సందర్భంగా ముస్లింలు జంతు బలి చేస్తారు. ఐదేళ్ల క్రితం వరకు బక్రీద్ పండగ వచ్చిందంటే చాలు రాజస్తాన్ నుంచి జిల్లా మీదుగా పెద్ద ఎత్తున ఒంటెలు క్యూ కట్టేవి.. వీటి తరలింపును నిషేధించడంతో ఒంటెల రవాణా నిలిచిపోయింది. ప్రస్తుతం జాతీయ స్థాయిలో గోవధను నిషేధించారు. దీంతో గోవులను అక్రమంగా తరలించి వధించకుండా ఉండేందుకు పోలీసు శాఖ ఆధ్వర్యంలో చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి నిఘా పెట్టారు.

సీసీ కెమెరాలతో పహారా

జిల్లాలోని మండలాల్లో పశువులపై రెవెన్యూ, పోలీసు యంత్రాంగం ప్రత్యేక నిఘా పెట్టింది. ప్రధానంగా గోవులను తరలించకుండా తెలంగాణ–కర్నాటక అంతర్రాష్ట్ర సరిహద్దుల మధ్య చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఖరీఫ్ సీజన్ కావడంతో విత్తనాలు వేసుకొనేందుకు ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి రైతులు పశువులను తరలిస్తారు. పంటల సాగుకు ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు పశువులను తరలించే వారు జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారులు జారీ చేసిన పత్రాలు ఉంటేనే వాటిని తరలించేందుకు అవకాశం కల్పించారు. జిల్లాలోని తాండూరు, వికారాబాద్, పరిగి సబ్ డివిజన్‌ల పరిధిలో పోలీసు అధికారులు పశువుల రవాణా జరగకుండా ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. మరోవైపు సీసీ కెమెరాల ద్వారా పట్టణ ప్రాంతాలలో పశువుల తరలింపుపై నిఘా పెట్టారు.

దాడులకు పాల్పడొద్దు

పశువులను, గోవులను తరలిస్తున్నారని ఓ వర్గం అడ్డుకోవడం, మరో వర్గం వారు వచ్చి గొడవలకు దిగడం వంటివి జరిగే అవకాశం ఉండటంతో పోలీసు అధికారులు అప్రమత్తమయ్యారు. ప్రధానంగా బీజేపీ, వీహెచ్‌పీ, బజరంగ్ దళ్ నాయకులకు సూచనలు చేశారు. అక్రమంగా రవాణా చేస్తున్నట్లు తెలిస్తే తమకు సమాచారం ఇవ్వాలని సూచించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఎవరినీ వదిలిపెట్టమని హెచ్చరించారు.

అప్రమత్తంగా ఉండాలి



చట్టరీత్యా జంతు బలి నేరం. బక్రీద్ ముగిసే వరకు పశువుల ఇతర ప్రాంతాలకు తరలించరాదు. అత్యవసరమైతే వెటర్నరీ శాఖ అధికారులు జారీ చేసిన పత్రాలు తప్పనిసరిగా ఉండాలి. బీజేపీ నాయకులు సంయమనం పాటించి శాంతి భద్రతలు విఘాతం కలగకుండా సహకరించాలి.

– బాలకృష్ణారెడ్డి, డీఎస్పీ, తాండూరు



అనంతగిరి: అడవిలో పరిశీలిస్తున్న ఎఫ్ఆర్వో అరుణ

అనంతగిరిలో చిరుత సంచారం!

- కొత్తపల్లిలో సామాజిక మాధ్యమాల్లో ప్రచారం
- పర్యటించిన అటవీ అధికారులు

అనంతగిరి: అనంతగిరి అడవుల్లో చిరుత సంచారం మరోసారి కలకలం రేపింది. శుక్రవారం ఉదయం అనంతగిరి హరిత రిసార్ట్స్ వెనుక వైపు 4 కుక్కలపై చిరుత దాడి చేసి చంపిందని స్థానికులు సమాచారం అందించడంతో ఫారెస్ట్ అధికారులు అప్రమత్తమయ్యారు. అక్కడికి వెళ్లి పరిశీలించారు. ఓ వైపు కొడంగల్ నియోజకవర్గం చౌడపూర్ పరిధిలో ఓ వ్యక్తిపై చిరుత దాడి చేసిందని వార్తలు రావడం అదే సమయంలో అనంతగిరిలో కుక్కలు చనిపోవడంతో ఫారెస్ట్ అధికారులు వాటి కాలి ముద్రల కోసం అన్వేషణ మొదలు పెట్టారు. ఎఫ్ఆర్వో అరుణ ఆధ్వర్యంలో బృందం చర్యలు చేపట్టింది.

గుర్తు తెలియని జంతువు దాడి

కుల్కచర్ల: గుర్తు తెలియని జంతువు సంచారం చౌడాపూర్ మండలం కొత్తపల్లి గ్రామంలో కలకలం రేపింది. బహిర్భూమికి వెళ్లిన యువకుడిపై చిరుతదాడి చేసిందంటూ పెద్ద ఎత్తున సామాజిక మాధ్యమాల్లో ప్రచారం జరిగింది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన పెంటల శేఖర్ గురువారం రాత్రి 10:30 గంటలకు బహిర్భూమి కోసం సమీపంలోని ఎస్టీ వసతి గృహం వెనకాల ఉన్న చెట్ల పొదలకు వెళ్లారు. కొద్దిసేపటికి అతడికి శబ్దాలు రావడంతో అక్కడి నుంచి వెళ్లేందుకు ప్రయత్నించాడు. ఈ క్రమంలో గుర్తు తెలి యని జంతువు దాడి చేసింది. దీంతో శేఖర్ గట్టిగా చిరుతా.. చిరుతా.. అని అరుస్తూ గ్రామంలోకి వచ్చారు. ఈ క్రమంలో బాధితుడి చేతికి స్వల్పగాయాలయ్యాయి. ఆ విషయాన్ని గ్రామస్తులకు చెప్పడంతో కొందరు సోషల్ మీడియాలో పెట్టడంతో యువకుడిపై చిరుత దాడి అని విస్తృతంగా ప్రచారం జరిగింది. విషయం తెలుసుకున్న అటవీశాఖ అధికారులు శుక్రవారం గ్రామానికి చేరుకుని బాధితుడి దగ్గర వివరాలు తీసుకున్నారు. అనంతరం గ్రామ సమీపంలోని ప్రాంతాలలో చిరుత ఆనవాళ్లను పరిశీలించగా ఎక్కడా లభించలేదు. శేఖర్‌పై దాడి చేసింది చిరుతకాకపోవచ్చని, గుర్తు తెలియని అడవి జంతువుగా అధికారులు పేర్కొన్నారు. చిరుత మనుషులపై దాడి చేసిన ఘటనలు చాలా అరుదుగా చోటుచేసుకుంటాయన్నారు. సామాజిక మాధ్యమాల్లో భయాందోళన కలిగించే అంశాలు ప్రచారం చేయవద్దని సూచించారు. కార్యక్రమంలో మహబూబ్‌నగర్ జిల్లా అటవీశాఖ ఎఫ్ఆర్‌ఓ మగ్బుల్ హుస్సెనీ, డివిజనల్ రేంజ్ ఆఫీసర్ సుమలత, సెక్షన్ ఆఫీసర్ జాకీరుద్దీన్, బీట్ అధికారులు ఆంజనేయులు, ఉదయేశ్వర్ పాల్గొన్నారు.



కుల్కచర్ల: గ్రామస్తులకు సూచనలు చేస్తున్న ఎఫ్ఆర్ఓ మగ్బుల్ హుస్సెనీ

కుటుంబ కలహాలతో యువకుడి ఆత్మహత్య

పూడూరు: కుటుంబ కలహాలతో యువకుడు మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని చన్గోముల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ మధుసూదన్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని మీర్జాపూర్ గ్రామానికి చెందిన వడ్డే మహేందర్(24) కుటుంబ కలహాలతో ఇంట్లో ఉరేసుకుని మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి తండ్రి చంద్రయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఎన్ఎంఎంఎస్‌లో సత్తా చాటిన పేదింటి బిడ్డలు



మనీషా

దోమ: జాతీయ ప్రతిభాన్వేషణ(ఎన్ఎంఎంఎస్) పరీక్షలో ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న పేద విద్యార్థులు ప్రతిభను కనబరిచారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థితో పాటు మోత్కూర్, దాదాపూర్, బడేంపల్లి కిష్టాపూర్ పాఠశాలలో చదువుకుంటున్న పదిమంది విద్యార్థులు జాతీయ ప్రతిభాన్వేషణ పరీక్షలో సత్తా చాటి ఉపకార వేతనానికి ఎంపికయ్యారు. మోత్కూరు పాఠశాలలో చదువుకుంటున్న పేదింటి విద్యార్థి మనీషా పరీక్ష రాసి ఉపకార వేతనాకికి ఎంపికైంది. ఈ మేరకు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మల్లేశ్వర్, ఉపాధ్యాయులు స్కాలర్‌షిప్‌కు ఎంపికైన విద్యార్థులను అభినందించారు. వీరికి రూ.12 వేల చొప్పున ఐదు సంవత్సరాల పాటు ఉపకార వేతనం ఇవ్వనున్నారు.

దర్గాను అభివృద్ధి చేయండి



అధికారికి వినతిపత్రం ఇస్తున్న ముస్లిం ప్రతినిధులు

కొడంగల్: పట్టణ శివారులోని షేక్ సాహెబ్ పహాడీ దర్గా అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డికి ముస్లిం ప్రతినిధులు శుక్రవారం వినతిపత్రం సమర్పించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి రాసిన లేఖను కడా అధికారికి అందజేశారు. షేక్ సాహెబ్ పహాడీ దర్గాలో సౌకర్యాలు లేక భక్తులు ఇబ్బంది పడుతున్నారని అన్నారు. దర్గాకు వెళ్లేందుకు రోడ్డు సౌకర్యం కూడా సరిగ్గా లేదన్నారు. మౌలిక సదుపాయాల కల్పనకు రూ.కోటి మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో పట్టణ మాజీ ఉప సర్పంచ్ ఎస్ఎమ్ గౌసస్, దర్గా కమిటీ అధ్యక్షుడు షేక్ షఫీ హైమద్ బిన్ జుబీర్ గాజీ, కాంగ్రెస్ యువజన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కృష్ణంరాజు, అబ్దుల్ జబ్బార్, సయ్యద్ ఖైరత్ అలీ, కరీం అష్రఫీ, అబ్దుల్ ఖయ్యూం, ఇసాక్ పాషా, షబ్బీర్ అలీ, అబ్దుల్ ఖాదర్ పాల్గొన్నారు.

టెస్కాబ్ వైస్ చైర్మన్‌కు సత్కారం

తుర్కయంజాల్: తెలంగాణ రాష్ట్ర కేంద్ర సహకార బ్యాంక్ (టెస్కాబ్) వైస్ చైర్మన్‌గా నియమితులైన కొత్తకుర్మ సత్తయ్యను శుక్రవారం సహకార సంఘం డైరెక్టర్లు, సిబ్బంది ఘనంగా సత్కరించారు. తుర్కయంజాల్ చైర్మన్ టెస్కాబ్‌కు ఎన్నిక కావడం గర్వించదగ్గ విషయమని ఈ సందర్భంగా కొనియాడారు. కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షుడు కొత్త రాంరెడ్డి, డైరెక్టర్లు సంజీవరెడ్డి, నర్సింగ్‌రావు, లక్ష్మారెడ్డి, యాదగిరి, లక్ష్మమ్మ, కృష్ణారెడ్డి, సత్యనారాయణరెడ్డి, సెక్రటరీ రాందాసు, నాయకులు శ్రీనివాస్, స్వామిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

కుల్కచర్ల: నిబంధనలకు విరుద్ధంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకుని సీజ్ చేసిన ఘటన కుల్కచర్ల మండల పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శుక్రవారం తెల్లవారుజామున బొంరెడ్డిపల్లి గ్రామం నుండి కుల్కచర్లకు ట్రాక్టర్‌లో ఇసుక తరలిస్తున్న క్రమంలో కుల్కచర్ల ప్రధాన చౌరస్తాలో పోలీసులు అడ్డుకుని ఇసుక తరలించేందుకు అనుమతులు ఉన్నాయా అని ప్రశ్నించగా లేవని సమాధానం చెప్పడంతో ట్రాక్టర్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఇసుక తరలిస్తున్న నిఖిల్‌పై కేసు నమోదు చేశామని ఎస్ఐ అన్వేష్ రెడ్డి పేర్కొన్నారు.

లొంగిపోయిన గోల్డ్‌షాపు వ్యాపారి

బాధితులకు నగదు, బంగారం చెల్లించాలని పోలీసుల ఆదేశం



వివరాలు వెల్లడిస్తున్న ఎస్ఐ

ధారూరు: తనఖా పెట్టిన నగలతో పరారైన వ్యాపారి పోలీసుల ఎదుట శుక్రవారం లొంగిపోయాడు. పోలీసుల వివరాల ప్రకారం.. గుజరాత్‌కు చెందిన దీపక్ వైష్ణవ్ తొమ్మిదేళ్లుగా ధారూరులో శ్రీరాం జ్యువెలరీ పేరిట బంగారం దుకాణాన్ని నిర్వహిస్తున్నాడు. స్థానికుల బంగారం, నగదుతో వ్యాపారి పరారీ అయ్యాడు. వైష్ణవ్‌తో నష్టపోయిన బాధితులు ఈనెల 11న పోలీసులకు ఫిర్యాదు చేశారు. అప్పటి నుంచి పోలీసులు కోస్గి, తాండూరు, చేవెళ్ల తదితర ప్రాంతాల్లో ఉన్న అతని బంధువులు, స్నేహితుల వద్ద వాకబు చేశారు. చివరకు వైష్ణవ్ బాబాయ్, తండ్రి, బంధువుల ద్వారా పోలీసుల ఎదుట లొంగిపోయాడు. అక్కడే ఉన్న బాధితులు సీఐ రామకృష్ణ, ఎస్ఐ వేణుగోపాల్‌గౌడ్‌ల సమక్షంలో తమ నగదు, బంగారం ఆభరణాలు ఇప్పించాలని కోరారు. కనీసం ఆరు నెలల పాటు గడువు కావాలని వ్యాపారి వర్గీయులు కోరగా అంత సమయం ఇవ్వలేమని చెప్పారు. దీంతో రెండు, మూడు నెలల లోపు సర్దుబాటు చేయాలని బాధితులు పోలీసులకు విన్నవించారు. ఇరువర్గాల నుంచి వచ్చిన వినతుల ఆధారంగా మూడు నెలల్లో బాధితుల నగదు, బంగారం వెనక్కి ఇవ్వాలని సీఐ ఆదేశించారు. తాకట్టు పెట్టిన బంగారం వెంటనే వెనక్కి ఇస్తామని వైష్ణవ్ వర్గీయులు అంగీకరించారు.

వాగులో గల్లంతైన వ్యక్తి మృతి

కిలోమీటర్ దూరంలో లభించిన మృతదేహం



మైతాబ్‌అలీ (ఫైల్)

మోమిన్‌పేట: మండలంలోని మేకవనంపల్లి వద్ద గురువారం రాత్రి వాగులో గల్లంతైన వ్యక్తి మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి.. మండల పరిధిలోని అంరాధికలాన్ గ్రామానికి చెందిన రైతు మైతాబ్ అలీ(28) గురువారం ఉదయం తన బైక్‌పై మెదక్ జిల్లా సదాశివపేటకు వెళ్లాడు. బైక్‌ను రిపేర్ చేయించుకుని రాత్రి 9గంటలకు మేకవనంపల్లి ఉన్నత పాఠశాల సమీపంలోని బండ్లవాగు వద్దకు చేరుకున్నాడు. అప్పటికే భారీ వర్షం కురవడంతో వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. ఎప్పుడూ వెళ్లే దారి కావడంతో బైక్‌తో వాగు దాటే ప్రయత్నం చేశాడు. ఈ క్రమంలో ద్విచక్ర వాహనం అదుపుతప్పి వరదలో కొట్టుకుపోయాడు. విషయం తెలుసుకున్న గ్రామస్తులు, బంధువులు, పోలీసులు అర్ధరాత్రి దాటే వరకూ మైతాబ్ ఆచూకీ కోసం గాలించారు. ఫలితం లేకపోవడంతో తిరిగి వెళ్లిపోయారు. శుక్రవారం ఉదయాన్నే వచ్చి వెతుకుతుండగా వాగులో కిలోమీటరు దూరంలో పొదల మధ్య చిక్కుకున్న శవం లభించింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మర్పల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ అరవింద్ తెలిపారు. మృతుడికి భార్యతో పాటు కుమారుడు ఉన్నారు.

సకాలంలో బియ్యం అందించాలి

అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్



మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్

అనంతగిరి: కొనుగోలు చేసిన ధాన్యాన్ని సకాలంలో మిల్లింగ్ చేసి బియ్యాన్ని ప్రభుత్వానికి అందించాలని జిల్లా అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్ మిల్లర్లను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశం హాలులో జిల్లాలోని రైస్ మిల్లర్లతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో కస్టమ్ మిల్లింగ్ రైస్‌ను ప్రభుత్వానికి డెలివరీ చేయాలని, లేనిపక్షంలో కఠిన చర్యలు తీసుకుంటామని ఆదేశించారు. రోజూ జిల్లా సివిల్ సప్లయ్ అధికారి, డీటీసీఎస్‌లు రైస్ మిల్లులను పర్యవేక్షించి సకాలంలో సీఎంఆర్‌ను డెలివరీ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రతి మిల్లరు చేయాల్సిన కస్టమ్ మిల్లింగ్ రైస్‌ను తమ కెపాసిటీ ప్రకారం చేసి వెంటనే ఎఫ్‌సీఐ గోదాంకు డెలివరీ చేయాలన్నారు. సమావేశంలో జిల్లా సివిల్ సప్లయ్ అధికారి రాజేశ్వర్, మేనేజర్ సుగునాబాయి, రైస్ మిల్లర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ బాలేశ్వర్ గుప్తా, సెక్రటరీ శ్రీధర్‌రెడ్డి, డీటీసీఎస్‌లు, మిల్లర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రాణం తీసిన పందెం

- స్నేహితుల చాలెంజ్‌తో పురుగు మందు తాగిన వ్యక్తి
- చికిత్స పొందుతూ ఉస్మానియాలో మృతి



సురేందర్ (ఫైల్)

శంకర్‌పల్లి: స్నేహితుల సరదా మాటలు, పందేలు ఓ నిండు ప్రాణాన్ని కబళించాయి. పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి.. మండల పరిధిలోని చెందిప్పకు చెందిన సురేందర్(45) కూలీ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఇతనికి భార్య, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. ఈనెల 1న గ్రామానికి చెందిన ఇద్దరు స్నేహితులతో కలిసి సురేందర్ బయటకు వెళ్లాడు. సరదా సరదాగా మాట్లాడుకున్న స్నేహితులు పురుగు మందు తాగితే రూ.లక్ష ఇస్తామని సురేందర్‌తో పందెం కాసారు. దీంతో అతడు నిజంగానే మందు తాగడంతో.. టెన్షన్‌కు గురైన మిత్రులు, తెలిసిన వాళ్లు విరుగుళ్లు ఇచ్చి వాంతులు చేయించారు. అంతా బాగుందని ఎవరి ఇళ్లకు వారు వెళ్లిపోయారు. మరుసటి రోజు నుంచి సురేందర్ ఆరోగ్యం క్షీణిస్తుండటంతో ఈనెల 4న సంగారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారు. పరిస్థితి విషమంగా మారడంతో 5న ఉస్మానియాకి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందాడు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

15 రోజుల్లో 147 మంది పోకిరీల అరెస్టు

సాక్షి, సిటీబ్యూరో: ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో మహిళలను వేధిస్తున్న ఆకతాయిల ఆటకట్టించారు రాచకొండ షీ టీమ్ పోలీసులు. 15 రోజుల్లో 147 మంది పోకిరీలను అరెస్టు చేశారు. వీరందరికీ వారి కుటుంబ సభ్యుల సమక్షంలో ఎల్బీనగర్‌లోని సీపీ క్యాంపు కార్యాలయంలో శుక్రవారం కౌన్సిలింగ్ నిర్వహించారు. పట్టుబడిన వారిలో 87 మంది మేజర్లు, 60 మంది మైనర్లు ఉన్నారని ఉమెన్ సేఫ్టీ వింగ్ డీసీపీ టీ ఉషావిశ్వనాథ్ తెలిపారు. ఆయా ఫిర్యాదుల్లో 11 మంది పోకిరీలపై క్రిమినల్ కేసులు నమోదు చేశారు.

మద్యం మత్తులో మాత్రలు మింగి మృతి



మల్లేశ్ (ఫైల్)

బొంరాస్‌పేట: మద్యం మత్తులో ఉన్న వ్యక్తి ఎక్కువ మోతాదులో మందు బిళ్లలు వేసుకుని మృత్యువాత పడిన సంఘటన మెట్లకుంటలో శుక్రవారం చోటుచేసుకుంది. ఎస్ఐ రవూఫ్ వివరాల మేరకు.. గ్రామానికి చెందిన పల్లెగడ్డ మల్లేశ్(32) కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో ఉదయం 11 గంటల సమయంలో మద్యం తాగిన అతను మైకంలో ఎక్కువ మొత్తంలో మందు బిళ్లలు మింగాడు. అస్వస్థతకు గురైన అతన్ని గమనించిన కుటుంబ సభ్యులు మొదట పరిగి ప్రభుత్వ ఆస్పత్రికి ఆ తర్వాత తాండూరులోని జిల్లా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా మారడంతో నగరంలోని గాంధీ ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు. మృతుడి తల్లి యాదమ్మ ఫిర్యాదు మేరకు కేసుమోదు చేశామన్నారు.

అందరూ ఉన్నా.. అనాథగా వెంకటమ్మ



అనాథాశ్రమంలో వేయాలని వేడుకుంటున్న వెంకటమ్మ

తాండూరు రూరల్: ఈ ఫొటోలో కనిపిస్తున్న వృద్ధురాలి పేరు చిట్లపల్లి వెంకటమ్మగౌడ్(70). అందరు ఉన్నా అనాథగా మారింది. తాండూరు మండలం కరన్‌కోట్ గ్రామస్తురాలు. ఆమె భర్త గతంలోనే చనిపోయారు. ఇద్దరు కొడుకులు, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. ఓ కొడుకు హైదరాబాద్‌లో, మరో కొడుకు బషీరాబాద్‌లో ఉంటున్నారు. ఆమెకు వ్యవసాయ భూమి లేదు. కొంతకాలంగా కాలంగా కరన్‌కోట్ బస్టాండ్‌లో ఉంటుంది. వర్షానికి తడుచుకుంటు బిక్కుబిక్కుమంటూ కాలం వెల్లదిస్తోంది. వెంకటమ్మను కుటుంబ సభ్యులు పట్టించుకోవడం లేదు. దీంతో తనని అనాథ ఆశ్రమంలో వేయాలని వెంకటమ్మ కోరుతోంది.

రక్తదానం మరొకరికి ప్రాణదానం



రక్తదానం చేస్తున్న సర్ఫరాజ్, పాల్గొన్న డీఎంహెచ్ఓ తదితరులు

అనంతగిరి: రక్తదానం ప్రాణదానం అని డీఎంహెచ్ఓ పల్వన్ కుమార్ అన్నారు. ప్రపంచ రక్త దాతల దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేయగా.. ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడారు. ఏటా జూన్ 14న ప్రపంచ రక్త దాతల దినోత్సవం జరుపుకొంటున్నామని తెలిపారు. రక్తాన్ని కృత్రిమంగా తయారు చేయలేమని, కావున 18 నుంచి 55 సంవత్సరాలు లోపు ఉన్న ఆరోగ్య వంతులు ఎవరైనా రక్తం దానం చేసి, మరొకరి ప్రాణాలను కాపాడాలని సూచించారు. ఇందులో ప్రోగ్రాం అధికారి డాక్టర్ రవీంద్ర యాదవ్, డిప్యూటీ డీఎంహెచ్ఓ జీవరాజ్, మునిసిపల్ మాజీ వైస్ చైర్మన్ రమేష్ కుమార్, కాంగ్రెస్ మైనారిటీ అధ్యక్షుడు సర్ఫరాజ్, నాయకులు నవాజ్, యాదగిరి, మోముల రాజ్ కుమార్, కార్యాలయ సిబ్బంది ఉన్నారు.